సాక్షి ఏలూరు

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



పేదలకు స్వగృహ యోగం

పశ్చిమ గోదావరి జిల్లాలో 71,283 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా 26,337 మంది గృహప్రవేశాలు చేశారు. 14,159 మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. 8లో



బైక్ దొంగల అరెస్టు

బైక్‌లు దొంగతనం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 8 బైక్‌లను పాలకొల్లు పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో



మోకీలు శస్త్రచికిత్సకు కేరాఫ్

మోకీలు శస్త్రచికిత్సలకు నూజివీడు కేరాఫ్‌గా మారింది. ఏరియా ఆస్పత్రిలో రెండు నెలల్లో ఏడుగురికి ఆపరేషన్లు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఏలూరు(మెట్రో) : జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, సాధారణ ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న దృష్ట్యా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 23న దివ్య దక్షిణ్ యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జనవరి 23న దివ్యదక్షిణ్ యాత్ర విత్ జ్యోతిర్లింగ పేరుతో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు జనవరి 23న సికింద్రాబాద్‌లో బయలుదేరి 31న తిరిగి వస్తుందన్నారు. సికింద్రాబాద్‌లో బయలుదేరిన రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో ఆగుతుందన్నారు. యాత్రలో భాగంగా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, త్రిచ్చి, తంజావూరు క్షేత్రాల్ని సందర్శించవచ్చన్నారు. ఎకానమీ క్లాస్ టిక్కెట్ ధర రూ.14,100, స్టాండర్డ్ క్లాస్ టిక్కెట్ ధర రూ.21,500, కంఫర్ట్ క్లాస్ టిక్కెట్ ధర రూ.27,900గా ఉందన్నారు. బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ విజయవాడ కార్యాలయం లేదా 82879 32312, 92814 95848 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దళిత వాడలను పంచాయతీలుగా చేయాలి

ఫైర్ సర్వీసెస్ డీజీపీ పీవీ.సునీల్ కుమార్

ఆకివీడు: దళిత వాడల్ని పంచాయతీలుగా చేసినప్పుడే దళిత ప్రాంతం, ప్రజల అభివృద్ధి జరుగుతుందని డీజీపీ పీవీ.సునీల్ కుమార్ చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపుర అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహం, సుప్రీంకోర్టు మాజీ జడ్జి స్వర్గీయ కటికతల రామస్వామి విగ్రహావిష్కరణ, కమ్యూనిటీ హాలు, వేదికలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో సునీల్ కుమార్ మాట్లాడుతూ మన వాడ–మన పాలన రావాలన్నారు. ఉప ప్రణాళిక నిధులు దళిత పంచాయతీలకు కేటాయించినప్పుడే అభివృద్ధి చెందుతాయన్నారు. ధర్మాపురం లాంటి పంచాయతీలు ఏర్పడినప్పుడు రూ.10 కోట్లు ఉప ప్రణాళిక నిధులు వస్తాయన్నారు. దళిత పంచాయతీలు ఏర్పాటు చేస్తామని చెప్పే పార్టీలకే ఓట్లు వేయాలన్నారు. డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరుకు రూ.3 కోట్లు రుణం అందజేస్తే అంబానీ, అదానీలు దళితుల్లోనూ పుట్టుకొస్తారని చెప్పారు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి దళితులు ఎదగాలన్నారు. గత 50 ఏళ్లలో ఒక్క దళితుడు మాత్రమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారని సునీల్ కుమార్ చెప్పారు. 3 వేలకు పైగా ఉన్న దళిత వాడలన్నీ పంచాయతీలుగా ఏర్పడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ, కెవీ లక్ష్మీనారాయణ, కటికతల సువర్ణరాజు, భమిడిపాటి సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి జీవితంలో నవశకం

ఉండి: జగనన్న కాలనీల ఏర్పాటుతో పేదవాడి జీవితంలో నవశకం ప్రారంభమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామం యండగండిలో జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న మంతెన రంగరాజు గృహప్రవేశానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాన్ని చూస్తుంటే సొంత కుటుంబ సభ్యులు కూడా ఇలా మనల్ని చూడరు కదా అనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా బతకాలని జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెనుకాడక రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 33 లక్షల మందికి ఇంటిస్థలాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి నిరుపేద జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో సొంతింటి కల నెరవేర్చుకున్నారన్నారు.

విజ్ఞాన బడి.. సిరుల పాడి

- పశు రైతుల అభివృద్ధే లక్ష్యంగా
- రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి
- జిల్లాలో 911 కేంద్రాల్లో అమలు



రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పశు విజ్ఞాన సాగుబడిలో రైతులకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అన్నదాతల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్న ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్బీకేల్లో రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. అలాగే పాడి రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. పశుపోషణ, మెలకువలపై పాడి రైతుకు అవగాహన కలిగించేలా కృషి చేస్తోంది. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం చేస్తున్నారు.

జిల్లాలోని 911 కేంద్రాల్లో..

జిల్లాలోని 911 రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం అమలు జరుగుతోంది. ప్రతి సచివాలయం పరిధిలో 373 మంది పశు వైద్య సహాయకులు, 187 మంది గోపాలమిత్రలు పాడి రైతులకు సలహాలు, సూచనలు అందించేలా కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మంగళవారం 54 చొప్పున విజ్ఞాన బడులు నిర్వహిస్తున్నారు. ఈ బడులను సుమారు 1000 మందికి పైగా పాడి రైతులు వినియోగించుకుంటున్నారు.

పాడి రైతులకు అవగాహన

పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పాడి రైతులకు పాడి పెంపకంపై, యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ కార్యక్రమం, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కలిగించేలా కృషి చేస్తున్నారు. పశువుల్లో వచ్చే వ్యాధులైన గొంతువాపు, జబ్బవాపు, సంచుల వ్యాధి, మేకలు, గొర్రెలకు వచ్చే చీకటి వ్యాధి, జీవాలకు టీకాలు వేసే సమయం తదితర అన్ని వివరాలను పశువైద్య సహాయకులు విజ్ఞాన బడుల్లో పాడి రైతులకు వివరిస్తారు. అలాగే దగ్గరుండి టీకాలు వేయిస్తారు. పశువుల కృత్రిమ గర్భధారణ గురించి వివరిస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



పశు విజ్ఞాన బడుల్లో అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఈ బడుల్లో పాడి రైతులకు పశువులకు, మేకలకు, గొర్రెలకు వచ్చే వ్యాధుల నివారణపై చేపడుతున్న అవగాహన కార్యక్రమం మేలుకరంగా ఉంది.

– తెల్లం దేవరాజు, రైతు, తూర్పు రేగులకుంట, బుట్టాయగూడెం మండలం

అన్ని కేంద్రాల్లోనూ అమలు



జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పశువిజ్ఞాన బడి కార్యక్రమం అమలు చేస్తున్నారు. పాడి రైతులకు పాడి పెంపకం మెలకువలపై, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్గించేలా కృషి చేస్తున్నారు. ఈ పశువిజ్ఞాన బడుల్లో సుమారు 1000 మందికి పైగా పాడి రైతులు అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు.

– డాక్టర్ జి.నెహ్రూబాబు, పశు సంవర్థక శాఖ జేడీ, ఏలూరు

పశుపోషణపై అవగాహన



పశు విజ్ఞాన బడిలో రైతులకు పశుపోషణలో మెలకువలపై అవగాహన కల్పిస్తున్నాం. పశువులు, మేకలు, గొర్రెల్లో వచ్చే వ్యాధులు నివారణకు జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా కృషి చేయడం జరుగుతుంది. పాడి రైతుకు ఖచ్చితమైన ఆదాయం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తుంది.

– డాక్టర్ టి. గోవిందరాజు, పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు, ఏలూరు

విజ్ఞానాన్ని అందించేలా..



రైతు భరోసా కేంద్రం రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయి. ఇక్కడ వ్యవసాయ పనులకే కాకుండా పాడి సంపదపై కూడా అవగాహన కల్గిస్తున్నారు. పశు విజ్ఞాన బడి పాడి రైతుకు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. పశుపోషణలో మెలకువలు నేర్పిస్తున్నారు.

– పైడిమర్ల జగన్‌మోహన్‌రెడ్డి, పాడి రైతు, దర్భగూడెం, జీలుగుమిల్లి మండలం

స్పందనలో 343 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 343 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం–స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల వారీగా అందిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

అర్జీల్లో కొన్ని..

టి.నరసాపురం మండలం బొర్రంపాలెం, ముత్యాలమ్మపేటకు చెందిన ముంగర శ్రీను అర్జీనిస్తూ తనకు చేపలు పట్టుకోవడానికి వలలు కొనుగోలుచేసేందుకు రూ. 50 వేల రుణం అందించాలని కోరారు. ఉంగుటూరు మండలం బొమ్మిడికి చెందిన సీహెచ్ దుర్గాదేవి అర్జీనిస్తూ తన భర్త వేరే మహిళతో ఉంటూ తమ పిల్లలను, తనను, పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నాడని తనకు న్యాయం చేయాలని కోరారు. కామవరపుకోట మండలం ఉప్పలపాడుకు చెందిన జె.సత్యనారాయణ అర్జీనిస్తూ తన గ్రామంలో భూమిని కొంతమంది ఆక్రమించారని తన భూమి ఇప్పించాలని కోరారు.

సంబరంగా కైకరం షష్ఠి



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు



కైకరం నాగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



ఉంగుటూరు: కైకరం సుబ్రహమణ్య షష్ఠి మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. వేలాదిమంది భక్తుల కోలాహలం నడుమ ఉత్సవాల్ని ప్రారంభించారు. ఆదివారం అర్ధరాత్రి 12.55 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం తెల్లారుజాము 2 గంటల నుంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం వరకు వేలాదిమంది భక్తులు నాగమ్మ తల్లిని దర్శించుకుని షష్ఠి తిరునాళ్లలో పాల్గొన్నారు. ఉదయం ఆలయం పక్కనే ఏర్పాటుచేసిన వేదిక మీద జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పది వేలమంది భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నాగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శానం బాబ్జీ, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వాసుబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఆరోగ్య శాఖ సిబ్బంది డా.లీలాప్రసాదు నేతృత్వంలో మెడికల్ శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు చేపట్టారు. గణపవరం సీఐ సుబాష్ నేతృత్వంలో చేబ్రోలు, గణపవరం, నిడమర్రు పోలీసులు శాంతి భద్రతల్ని పర్యవేక్షించారు. జిల్లా నలుములలనుంచి వచ్చిన భక్తులతో షష్ఠి తిరునాళ్లు కళకళలాడాయి. ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు నాగమ్మతల్లిని దర్శించుకున్నారు. బాదంపూడి దత్త బాలసుబ్రహమణ్య స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడి, యర్రమళ్ల సుబ్రాహమణ్య స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

రూ.25 లక్షలకు పెంపు చరిత్రాత్మకం

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల ప్రారంభోత్సవంలో మంత్రి కారుమూరి



తణుకులో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త కార్డును లబ్ధిదారుడికి అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం చరిత్రాత్మకమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆరోగ్యశ్రీ కార్డులను మంత్రి కారుమూరి ఆవిష్కరించి మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల ఆరోగ్యానికి అండగా నిలిస్తే అదే ఆరోగ్యశ్రీని పథకానికి మరింత బలాన్ని చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ప్రదాతగా చరిత్రలో నిలుస్తారని అన్నారు. ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్‌ల పేరుతో ఇంటివద్దకే ఖరీదైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. కొత్త కార్డులను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిందుగపల్లి బలరామకృష్ణ, తణుకు నియోజకవర్గ పరిశీలకుడు మంతెన యోగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంజీవని.. ఆరోగ్యశ్రీ

- చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- 6.33 లక్షల కుటుంబాలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్సల వ్యయపరిమితి రూ.25 లక్షలకు పెంచి మరింత మెరుగైన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్యశ్రీలో రూ. 25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడం, ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీప్రశాంతి, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు, డీఎంహెచ్ఓ డా.షర్మిష్ట, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ ఐ.రాజీవ్ పాల్గొన్నారు.

జనవరిలో రెండో విడత జగనన్న సురక్ష

ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడంపై ప్రచురించిన అవగాహన కరపత్రాలను, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ఆవిష్కరించారు. పలువురు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎస్పీ డి.మేరీప్రశాంతి పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం పొందడం, ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలపై ఏఎన్ఎం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందే విధానంపై రూపొందించిన ప్రత్యేక యాప్‌తో పాటు కుటుంబంలో కనీసం ఒకవ్యక్తి దిశ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. జనవరి నుంచి జగనన్న సురక్ష రెండో విడత ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 6.33 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డును అందిస్తామన్నారు. రేపటి నుంచి గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఆరోగ్యశ్రీ ఎంతో దోహదపడుతుందన్నారు. సుమారు 3,257 చికిత్సలను, 2285 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పొందే సౌకర్యాన్ని కల్పించారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు వైద్య రంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు.

కలిసి నడుద్దాం.. ప్రగతి సాధిద్దాం

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో విద్యార్థుల జోష్
- ఏలూరులో వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ
- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి హాజరు





ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, చిత్రంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు, వన్స్ మోర్ సీఎం జగన్ అంటూ విద్యార్థుల కేరింతలు



ర్యాలీలో భారీగా పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో జగన్ నినాదం మార్మోగింది. వేలాది మంది విద్యార్థులు నగరంలోని ప్రధాన రహదారుల్లో భారీ ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థి సాధికారిత ర్యాలీని చేపట్టారు. తొలుత ఏలూరు జెడ్పీ కార్యాలయ నుంచి ర్యాలీగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్ ఫైర్‌స్టేషన్ సెంటరులోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏలూరులో చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో విద్యార్థులతో నిర్వహించిన భారీ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. వేలాది మంది విద్యార్థులు జగన్ నినాదాలతో హోరెత్తించారు. గిరాగిరా తిరుగుతోంది ఫ్యాను అంటూ పార్టీ జెండాలను పైకి తిప్పుతూ సందడి చేశారు.

కలిసి నడుద్దాం: అంబటి రాయుడు

అంబటి రాయుడు మాట్లాడుతుండగా విద్యార్థులు చప్పట్లు.. ఈలలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్యార్థులంతా కలిసి నడుద్దామా.. అంటూ అంబటి చెప్పగా నడుద్దామంటూ విద్యార్థులు కేరింతలు కొడుతూ తమ మద్దతు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం చేపడుతున్న ఆడుదాం– ఆంధ్ర కార్యక్రమంలో సత్తా చాటాలన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి: కోటగిరి

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ చెప్పారు. రాబోయే కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చి ప్రతి పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు ఉన్నత విద్య అందేలా తమ వంతు బాధ్యత నెరవేరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోనుగంటి చైతన్య, ఏలూరు అధ్యక్షుడు ఏలూరు అంజి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు, విద్యార్థి విభాగం సెక్రటరీ భరత్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వైఎన్‌వీ శివరావు, విద్యార్థి నాయకులు దిలీప్, సాయి, సందీప్ చిగురుపాటి, వినయ్, ప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరి మీదుగా గోవుల అక్రమ రవాణా

కుక్కునూరు: గోదావరి నది మీదుగా గోవుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గత కొంతకాలంగా మండలంలోని రేవుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా గోవుల తరలింపు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గోవులను కొనుగోలు చేసి వాటిని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం, వీఆర్ పురం మండలాల్లోని గోదావరి రేవుల నుంచి మండలంలోని రేవులకు పడవలపై తరలిస్తున్నారు. అలా మండలం నుంచి అశ్వారావుపేటకు తరలించి అక్కడ నుంచి వాహనాలలో నగరాలకు తరలిస్తున్నట్టు సమాచారం. సోమవారం కూడా గోవులను గోదావరి నది మీదుగా దాచారం రేవుకు పడవలలో తరలించారు. విషయం తెలుసుకున్న విలేకరులు నది ఒడ్డుకు చేరుకోగా గోవులను అక్కడ వదిలేసి పరారు కావడం గమనార్హం.

ఏటీఎం కార్డు ఏమార్చి రూ.1.86 లక్షల అపహరణ

జంగారెడ్డిగూడెం: నగదు విత్‌డ్రా కోసం ఏటీఎంకు వెళ్లిన ఓ వ్యక్తి నుంచి ఏటీఎం కార్డు ఏమార్చి ఓ ఆగంతకుడు రూ.1.80 లక్షలు అపహరించాడు. వివరాలిలా ఉన్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ తన భార్య బ్యాంక్ ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు ఈ నెల 14వ తేదీన జంగారెడ్డిగూడెంలోని ఏటీఎంకు వెళ్లాడు. అక్కడ ఓ అపరిచితుడి సాయంతో రూ.5 వేలు విత్‌డ్రా చేశాడు. అయితే ఆగంతకుడు అరుణ్‌కుమార్ వద్ద ఉన్న ఏటీఎం కార్డును మార్చి తన వెంట తీసుకువెళ్లి దఫదఫాలుగా రూ.1.86 లక్షలు విత్‌డ్రా చేశాడు. ఈ మేరకు అరుణ్‌కుమార్ ఫోన్‌కు నగదు విత్‌డ్రా మెస్సేజ్‌లు రావడంతో ఆందోళనకు గురై సోమవారం జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

భీమవరం: భీమవరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వరకట్నం వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదలకు సంబంధించిన 16 ఫిర్యాదులు అందాయని ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ రవిప్రకాష్, అడిషినల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించినట్లు చెప్పారు.

పేదలకు స్వగృహ యోగం

- అద్దె బతుకులకు చెల్లుచీటీ
- జగనన్న కాలనీల్లో పుంజుకున్న ఇళ్ల నిర్మాణం
- ఇప్పటికే సగానికి పైగా గృహప్రవేశాలు పూర్తి
- కాలనీల్లో మెరుగుపడుతున్న సౌకర్యాలు


తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లు


తాళ్లకోడు జగనన్న కాలనీలో విశాలమైన రోడ్లు

ఆకివీడు: ఏళ్లు గడిచినా, ఎన్నో ప్రభుత్వాలు మారినా పేదల తలరాత మారలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా వారి బతుకులు ఉన్నాయి. మురుగు కాల్వలు, రోడ్డు మార్జిన్లలో, శ్మశానవాటికలో తరతరాలుగా నిరుపేదలు దుర్భర జీవనం గడిపారు. పేదోడి దుస్థితిని పాదయాత్రలో స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘నేను విన్నాను, నేను న్నాను’ అంటూ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వారి సొంతింటి కల కలగానే మిగిలిపోకూడదని ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందించారు. పలు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయంతో పాటు లబ్ధిదారుల తమ సొంత సొమ్ము వెచ్చించి నిర్మాణ పనుల్ని మొదలుపెట్టారు. ప్రభుత్వం సహకారంతో సొంత ఇంటి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకుంటున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం జిల్లాలో 71,283 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా, వీరిలో ఇప్పటివరకు 26,337 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారు. కాగా మరో 14,159 మంది లబ్ధిదారుల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటిని జనవరి నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రభుత్వం గృహనిర్మాణ శాఖ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ వేగం పుంజుకుంది. పలు చోట్ల గృహప్రవేశాలు సైతం చేస్తున్నారు.

జిల్లాలో జగనన్న కాలనీలో ఇళ్ల వివరాలు	
జిల్లాలో మొత్తం మంజూరైన ఇళ్లు	71,283
ఇప్పటివరకు నిర్మాణం పూర్తయినవి	26,337
జనవరి నాటికి నిర్మాణ లక్ష్యం	14,150

వేగంగా మౌలిక వసతులు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు వేగంగా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాలనీల్లో ఇప్పటికే విద్యుత్ సౌకర్యం కల్పించారు. లోఓల్టేజ్ సమస్య లేకుండా అధిక సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. 33 కేవీ సబ్‌స్టేషన్లను ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఉచిత కనెక్షన్ అందజేసి, మీటరు, బోర్డు, వైరు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. జగనన్న లేఅవుట్‌లో విశాలమైన రోడ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గ్రావెల్, డస్ట్ రోడ్లు పలుచోట్ల వేశారు. మంచినీటి సరఫరా కోసం పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేశారు. కుళాయిల లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీల్లో 60 శాతం పైబడి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన తరువాత రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నాం



జిల్లాలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల్ని చైతన్యపరుస్తున్నాం. ఇప్పటికే పలు చోట్ల బేస్‌మెంట్, శ్లాబ్ లెవిల్‌లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. వచ్చే జనవరి నెలాఖరు నాటికి జిల్లాలో మరో 14,159 ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటికే 26,337 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారు.
– ఆర్‌సీ ఆనంద కుమార్, పీడీ, జిల్లా గృహ నిర్మాణ శాఖ, భీమవరం

సొంతింటి కల జగనన్న నెరవేర్చారు



సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారు. అద్దె ఇళ్లల్లోనే పుట్టి, అద్దె ఇళ్లల్లో పెరిగాం. మా తల్లిదండ్రులు అద్దె ఇళ్లల్లోనే కాలం చేశారు. ఆ పరిస్థితి లేకుండా జగనన్న మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ఇచ్చారు. మిగిలిన సొమ్ము వేసుకుని ఇల్లు నిర్మించుకుని చిరువ్యాపారం పెట్టుకుని జీవిస్తున్నాం.
– నీలం సుధ, తాళ్లకోడు జగనన్న కాలనీ, కుప్పనపూడి, ఆకివీడు మండలం

మా జీవితంలో వెలుగులు నింపారు



సీఎంగా జగనన్న రావడం పేదల చేసుకున్న అదృష్టం. చాలీచాలని సంపాదనతో అద్దె ఇళ్లలో బతుకుతూ జీవనం గడుపుతున్న మాకు జగనన్న ఇంటి స్థలం ఇచ్చారు. గతంలో అనేక దరఖాస్తులు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. మా బతుకుల్లో వెలుగుల్ని జగన్ నింపారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.
-నెల్లూరి రామకృష్ణ, జగనన్న కాలనీ, కుప్పనపూడి, ఆకివీడు మండలం

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

రూ.4 లక్షల విలువైన 8 బైక్‌లు స్వాధీనం


పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

పాలకొల్లు సెంట్రల్: ద్విచక్రవాహనాలు దొంగతనం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ దారావత్తు రాంబాబు చెప్పారు. సోమవారం విలేకరులకు సీఐ కేసు వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం నరసాపురం రోడ్డు అయ్యప్పస్వామి టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నరసాపురం నుంచి పాలకొల్లు వైపు ఓ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా ముగ్గురు వ్యక్తులు వెళుతున్నట్లు పోలీసులు గమనించారు. వారిని ఆపే ప్రయత్నం చేయగా, వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. వెంటనే ఎస్సై, సిబ్బందితో కలిసి వారిని వెంబడించి పట్టుకున్నారు. వీరిని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బెండమూరులంకకు చెందిన వై.కృష్ణబాబు, అల్లవరం మండలం గుండేపూడి గ్రామానికి చెందిన కె.ఓం సాయితేజ, రాజోలు మండలం పొదలాడకు చెందిన జి వెంకటరత్నంలుగా గుర్తించారు. వీరిని విచారణ చేయగా ఈనెల 11వ తేదీన పాలకొల్లు మండలం పూలపల్లిలోని ఓ ఇంట్లో రాత్రి 1 గంట సమయంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అదే విధంగా గత నాలుగు నెలలుగా పశ్చిగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా, వైజాగ్ జిల్లాల పరిసర ప్రాంతాల్లో మోటర్ సైకిళ్లు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి బుల్లెట్‌లు–2, గ్లామర్–1, హోండా ఫ్యాషన్–2, స్ప్లెండర్–1, షైనీ–1, పల్సర్–1 మొత్తం రూ.4 లక్షలు విలువైన ఎనిమిది మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై ఎస్.ముత్యాలరావు, వీఆర్వో జోగారావు, కానిస్టేబుళ్లు సుబ్రహ్మణ్యం, చింతన్న, వై.మణి పాల్గొన్నారు.

ఫామ్–7లో తప్పుడు వివరాలిస్తే క్రిమినల్ కేసు


నూజివీడులో ఓటర్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న పరిశీలకులు బి.శ్రీధర్

నూజివీడు: ఓటర్ల జాబితాల సవరణలో భాగంగా ఫామ్–7లో ఎవరైనా తప్పుడు వివరాలు ఇస్తే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పరిశీలకులు బి.శ్రీధర్ హెచ్చరించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని పోలింగ్‌స్టేషన్‌లను సందర్శించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు నమోదుకు, తొలగింపు, సవరణ కోసం వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటే పుట్టినరోజు ధ్రువీకరణ, పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డులలో ఏదోకటి తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే ఫామ్–7 సైతం క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే ఓట్లను తొలగించాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలంటే డెత్ సర్టిఫికెట్‌ను లేదా పంచనామా సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఎన్ఆర్ఐలకు ఇక్కడ ఓటు హక్కు ఉంటే దానిని తొలగించడానికి లేదన్నారు. డబ్లింగ్ ఓట్లను గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్ రూపొందించడం జరిగిందని, రాబోయే నూతన ఓటర్ల జాబితాల్లో డబ్లింగ్ ఓట్లు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఎల్‌వోలు అన్ని దరఖాస్తులను సక్రమంగా విచారించి చర్యలు తీసుకుంటున్నారన్నారు. వచ్చిన అర్జీలను ఈనెల 26వరకు పరిశీలిస్తామని, ఆ తరువాత ఓటర్ల జాబితా తయారీ కార్యక్రమం ఉంటుందన్నారు. పరిశీలకుని వెంట సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, బీఎల్‌వోలు ఉన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ రీజనల్ స్పోర్ట్స్ మీట్

పెంటపాడు: తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ 2023–24 రీజనల్ మీట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈనెల 19 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కారు ఢీకొని యువకుడి మృతి


ఘటనా స్థలంలో సుందరయ్య మృతదేహం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కంభంపాడుకు చెందిన దొడ్డ సుందరయ్య (30) వ్యక్తిగత పనులపై సోమవారం ఆగిరిపల్లి నుంచి బైక్‌పై విజయవాడ వెళుతుండగా విజయవాడ రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కిందపడిపోయిన సుందరయ్యను వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై చంటిబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం


ఘటనా స్థలంలో రమేష్ మృతదేహం

పాలకోడేరు: వ్యాన్‌కు తాడుకట్టి తీసుకువెళుతున్న మరో వ్యాన్ అదుపుతప్పి పంటకాలువలో దూసుకువెళ్లిన ఘటనలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మోగల్లుకు చెందిన కామన రమేష్ (35) మినీ వ్యాన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాన్ మరమ్మతులకు గురవడంతో సోమవారం రాత్రి తన మిత్రుడికి చెందిన మరో మినీ వ్యాన్‌కు తాడు కట్టి భీమవరం నుంచి మోగల్లుకు తీసుకువెళుతున్నారు. వశిష్ట మెరైన ఫ్యాక్టరీ మలుపు వద్దకు వచ్చేసరికి వాహనానికి కట్టిన తాడు తెగి రమేష్ ఉన్న మినీ వ్యాన్ అదుపు తప్పి పంటకాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీట్‌లో ఉన్న రమేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భార్యాపిల్లలతో కలిసి షష్ఠి ఉత్సవానికి హాజరయ్యేందుకు వెళదామని చెప్పిన రమేష్ మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడనే లోగానే మృత్యు ఒడికి చేరడంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. ఎస్సై నాళం శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకునికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోకీలు శస్త్రచికిత్సకు కేరాఫ్ నూజివీడు

- మోకీలు శస్త్రచికిత్సలకు కేరాఫ్ నూజివీడు
- ఏరియా ఆస్పత్రిలో రెండు నెలల్లో ఏడుగురికి ఆపరేషన్లు
- 50కి పైగా ఇతర ఎముకలు విరిగిన కేసులకు సర్జరీలు
- ఆస్పత్రి వైద్యుడు ఆర్థో సర్జన్ ఏవీఆర్ మోహన్ ఘనత


మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ఏవీఆర్ మోహన్

నూజివీడు: గతంలో నూజివీడు ప్రాంతంలో భవనాలు, చెట్లుపై నుంచి కింద పడిన సందర్భాల్లో, రోడ్డు ప్రమాదాల్లో చేతులు, కాళ్ల ఎముకలు విరిగినా, చిట్లినా లేదా ఎముకలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసేవారు. అది ఒకప్పటి మాట. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు స్పెషలిస్టు వైద్యులను నియమించడంతో నేడు మెరుగైన వైద్యం అందించి క్షతగాత్రులను, రోగులను క్షేమంగా ఇంటికి పంపుతున్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రికి ఇలా వచ్చిన క్షతగాత్రులు, రోగులకు ఆర్థో విభాగానికి సంబంధించి కేసులు రిఫర్ చేయడమనేది ఇటీవల కాలంలో జరగలేదు. ఆర్థో సర్జన్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ ఈ ఆస్పత్రిలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఎములకు సంబంధించిన శస్త్రచికిత్సలకు నూజివీడు ఏరియా ఆసుపత్రి కేంద్రంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు.

రెండు నెలల నుంచే..

ఆర్థో సర్జన్ ఏవీఆర్ మోహన్ రెండు నెలల క్రితం పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి బదిలీపై వచ్చారు. ఆయన వచ్చిన దగ్గర నుంచి ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను ఉపయోగించుకుంటూ మోకీలు మార్పిడి ఆపరేషన్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చే పలువురు బాధితులకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేసి వారిని క్షేమంగా తిరిగి ఇళ్లకు పంపుతున్నారు. ఈ రెండు నెలల కాలంలో ఇప్పటి వరకు ఏడుగురికి మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలను చేశారు. వీరిలో ఇద్దరు రెండు కాళ్లకూ శస్త్రచికిత్సలు చేయించుకోవడం విశేషం. దాదాపు పదేళ్లుగా మోకాలు నొప్పులతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్న వీరు ఇప్పుడు ఉపశమనం పొందడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా నలుగురు మోకీళ్ల ఆపరేషన్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

50 మందికి పైగా ఆర్థో శస్త్రచికిత్సలు

అలాగే రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలకు గురై కాళ్లు, చేతుల ఎముకలు విరిగిన వారికి సైతం నూజివీడు ఏరియా ఆసుపత్రిలోనే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. రెండు నెలల కాలంలో 50 మందికి పైగా ఆపరేషన్‌లు చేశారు. గతంలో అయితే ఏ చిన్న సమస్య ఉన్నా విజయవాడకు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఇక్కడే శస్త్రచికిత్సలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

పదేళ్ల నుంచి బాధపడుతున్నా



పదేళ్ల నుంచి కుడి మోకీలు నొప్పితో బాధపడుతున్నా. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో మోకీలు మార్పిడి ఆపరేషన్ చేస్తున్నారన్న విషయం తెలుసుకుని ఇక్కడకు వచ్చా. వెంటనే తనకు ఆర్థో వైద్యులు ఆపరేషన్ చేశారు. పదేళ్లుగా పడుతున్న బాధ నుంచి విముక్తి కలిగింది. ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.2.50 లక్షలు అయ్యేవి. ఇక్కడ ఉచితంగా చేశారు.
– చెరుకూరి ఉషారాణి, శోభనాపురం, ఆగిరిపల్లి మండలం

రెండు కాళ్లకు చేయించుకున్నా



తొమ్మిదేళ్లుగా రెండు మోకాళ్లకు విపరీతమైన నొప్పితో బాధపడుతున్నా. ప్రైవేటు ఆసుపత్రుల్లో అడిగితే రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. అంత స్థోమత లేక అలాగే నొప్పి భరిస్తున్నా. ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ శస్త్రచికిత్సలు చేస్తున్నారన్న విషయం తెలుసుకుని వెళ్లగా ఆపరేషన్‌ను విజయంతంగా చేశారు. ఇప్పుడు చక్కగా నడుస్తున్నాను.
– బొందిలి అనురాధాబాయి, నూజివీడు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఏరియా ఆసుపత్రిలో ఎముకలకు సంబంధించి ఎటువంటి శస్త్రచికిత్స అయినా ఉచితంగా చేస్తున్నాం. ఇక్కడ ఉన్న సదుపాయాలను, సేవలను ప్రజలు వినియోగించుకోవాలి. ఎముకలు విరిగినా, మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లాల్సిన పనిలేదు. ఏరియా ఆసుపత్రిలోనే శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం.
– డాక్టర్ ఏవీఆర్ మోహన్, ఆర్థో సర్జన్, సూపరింటెండెంట్, నూజివీడు ఏరియా ఆసుపత్రి

